క్లుప్తంగా

అంతరిక్ష పరిశోధనలపై అవగాహన అవసరం



రాకెట్ నమూనాను పరిశీలిస్తున్న కళాశాల సిబ్బంది

సీటీఆర్ఐ: అంతరిక్ష పరిశోధనలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎస్కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపాణ్యం అన్నారు. ఆ కళాశాలలో బుధవారం స్పేస్ టెక్నాలజీ అవేర్‌నెస్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ సైన్స్ ప్రాజెక్టు నమూనాలను ప్రదర్శించారు. వీటిలో 8 అడుగుల రాకెట్ నమూనా ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ తిరుపాణ్యం మాట్లాడుతూ నేటి విజ్ఞానం అంతరిక్ష పరిధిని దాటి పోయిందన్నారు. భౌతిక శాస్త్ర విభాగాధిపతి సరోజిని, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.స్వర్ణశ్రీ, జి.శరత్ బాబు, డాక్టర్ పీవీబీ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అభినందన



ప్రశంసా పత్రాలు అందుకున్న ఆర్టీసీ సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేస్తున్న ఉద్యోగులు తమ తోటి వారికి మార్గదర్శకులుగా నిలుస్తున్నారని రాజమహేంద్రవరం డిపో మేనేజర్ మాధవ్ అన్నారు. అధిక కేఎంపీఎల్, ఈపీకే తీసుకువచ్చిన డ్రైవర్లు, కండక్టర్లను బుధవారం డిపోలో సత్కరించారు. ఆగస్టులో అత్యధిక ఈపీకే తెచ్చిన నలుగురు కండక్టర్లు, ఇద్దరు డ్రైవర్లు, అత్యధిక కేఎంపీఎల్ తెచ్చిన ముగ్గురు డ్రైవర్లు, అలాగే ఇద్దరు గ్యారేజీ సిబ్బందికి ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ అజయ్ బాబు, ట్రాఫిక్, గ్యారేజీ, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

శివకు పీస్ ఐకాన్ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న గెడ్డం శివ

కడియం: గ్లోబల్ పీస్‌డేను పురస్కరించుకుని గ్లోబల్ పీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అందించే పీస్ ఐకాన్ -2025 అవార్డును చిరు సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గెడ్డం శివ బుధవారం అందుకున్నారు. కాకినాడ జేఎన్‌టీయూలోని వీసీ చాంబర్‌లో ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు అభినందన



కానిస్టేబుల్ వెంకటరత్నంను అభినందిస్తున్న గిరజాల బాబు తదితరులు

కడియం: చెప్పులు లేకుండా నడుస్తున్న చిన్నారులను గమనించి, వారికి చెప్పులు కొనిపెట్టి మానవత్వం చాటిన ట్రాఫిక్ కానిస్టేబుల్ వెంకటరత్నంను బాధ్యత సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) అభినందించారు. విజయవాడ కామయ్యతోపు జంక్షన్‌లో ట్రాఫిక్ విధుల్లో ఉన్న ఆయనను బుధవారం బాబు తదితరులు కలిశారు. శాలువా, పుష్పగుచ్ఛం, మెమెంటో అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు, సంస్థ సభ్యులు మహమ్మద్ సర్కార్ బాషా, పున్నమరాజు వీర్రాజు, కొక్కిరాల వెంకటేశ్వరరావు, రాగోలు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు నిరంతర కృషి

కంబాలచెరువు: విద్యార్థులు లక్ష్య సాధనకు నిరంతర కృషి చేయాలని, దాని కోసం పుస్తక పఠనం ఉపయోగపడుతుందని విశ్రాంత బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ కమిషనర్, ఐఏఎస్ ఆఫీసర్ చక్రపాణి అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులతో కలసి ప్రత్యేకంగా వివిధ అంశాలపై బుధవారం ఆయన ముఖాముఖి చర్చ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనికి కళాశాల ప్రిన్సిపాల్ నరసింహం అధ్యక్షత వహించగా, జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి డి.విజయశ్రీ, కాకినాడ జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి ఐ.శారద హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు నిత్య విద్యార్థిగా ఉంటూ కొత్త విషయాలు తెలుసుకోవాలన్నారు. వాటికి విద్యార్థులకు చక్కగా చెప్పినప్పుడే పాఠ్యాంశాలపై మరింత శ్రద్ధ ఇష్టం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో కోరుకొండ కళాశాల ప్రిన్సిపాల్ డి.కృష్ణ కిశోర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రహజారులు

- యథేచ్ఛగా ఇసుక లారీల రాకపోకలు
- నిబంధనలు పాటించని వైనం
- రోడ్లపై పడుతున్న ఇసుక
- జారిపడుతున్న వాహన చోదకులు



నగరంలో దూసుకుపోతున్న ఇసుక లారీ



పరిమితికి మించిన ఇసుక లోడుతో వెళుతున్న లారీ

కంబాలచెరువు: రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఇప్పటికే ట్రాఫిక్ రద్దీతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే ఇరుకు, ఆపై అధ్వానంగా ఉండే రహదారులపై డ్రైవింగ్ చేయడానికి అష్టకష్టాలు పడుతున్నారు. ఇప్పుడు వీరందరికీ కొత్త సమస్య వచ్చింది. రవాణా సమయంలో లారీల పైనుంచి జారి రోడ్డుపై పడుతున్న ఇసుకతో తీవ్ర అవస్థలు ఎదురవుతున్నాయి. ఇసుక కారణంగా వాహనాల టైర్లు పట్టుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఇష్టానుసారం

అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఉన్న ఇసుక రేవుల నుంచి నగరంలోకి ఇష్టానుసారం ఇసుక లోడు లారీలు తిరుగుతున్నాయి. ఇవే ప్రమాదాలకు, ట్రాఫిక్ చిక్కులకు కారణమవుతున్నాయి. అధికార, అనధికార ఇసుక ర్యాంపులు ఎటువంటి నిబంధనలు పాటించకుండా రాకపోకలు సాగిస్తుండడంతో ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా వాహనాలు ఎటువంటి ఫిట్‌నెస్ లేకుండానే రోడ్డుపైకి వస్తుండడంతో తరచూ మరమ్మతులకు గురై రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి.

పరిమితికి మించి..

పరిమితికి మించి లోడుతో రాకపోకలు సాగించడం, ఆ ఇసుకపై ఎటువంటి బరకాలు తప్పకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా లారీలు తిరిగిన రోడ్డంతా ఇసుక ధారగా పడుతోంది. అలాగే ఇసుక రేణువులు గాలిలో ఎగిరి వెనుక వచ్చి వాహన చోదకుల కళ్లలో పడుతున్నాయి. ఇసుక తెచ్చే సమయంలో గోదావరి రేవులోని బురద మట్టి నగర ప్రవేశ ద్వారంలో రోడ్లపై మందంగా పేరుకుపోయి, దుమ్ముకు కారణమవుతోంది. ఇటీవల ధవళేశ్వరం, పాలకేంద్రం, మల్లయ్యపేట పెట్రోలు బంకు సమీపంలోని ఇసుక ర్యాంపు అప్రోచ్ రోడ్ల వద్ద దుమ్ము కారణంగా ఆయా ప్రాంత వాసులు ఆందోళనలు కూడా చేశారు.

ప్రశ్నిస్తే దాడులు

నిబంధనలు పాటించని ఇసుక ర్యాపు యాజమానులను స్థానికులు ప్రశ్నిస్తుంటే వారిపై దాడులు చేసిన సందర్భాలు ఉన్నాయి. వారిని ఎదుర్కోలేక సేవ్ మల్లయ్యపేట అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి తమ ఆక్రోశాన్ని వెల్లబుచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా రయ్‌మని దూసుకుపోయే ఇసుక లారీలకు కళ్లెం వేసే ప్రయత్నాన్ని సంబంధిత శాఖాధికారులు చేయకపోవడం శోచనీయం. ట్రాఫిక్ పోలీసుల కళ్లముందే అలా దూసుకుపోతున్నా తూతూ మంత్రంగా చలానాలతోనూ, లేకపోతే వారిచ్చే కొద్దోగొప్పో మామూళ్ల కారణంగానో అడ్డుకట్ట వేయలేకపోతున్నారు.

ప్రత్యేక సమావేశంలో నాయకులు



సమావేశంలో పాల్గొన్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎంపీ భరత్ రామ్, గిరజాల వీర్రాజు

ప్రకాశం నగర్: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్లమెంట్ నియోజకవర్గాల ఇన్‌చార్జులు, పరిశీలకులు, మాజీ మంత్రులు, పార్టీ సంస్థాగత కార్యవర్గ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ భరత్ రామ్, రాజమహేంద్రవరం పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, గిరజాల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి ఎకరాలకు ముంపు ముప్పే!



అక్విడెక్టు వద్ద శిథిలమైన రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న రైతులు

కడియం: ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సుమారు వెయ్యి ఎకరాలకు ముప్పు పొంచి ఉందని దుళ్ల గ్రామానికి చెందిన రైతులు చిట్టూరి వెంకన్న చౌదరి, యన్నమని పెదనాని, కంటిపూడి శ్రీనివాస్, పట్టాభి, జమీందారు, కంటిపూడి రాము, గారపాటి సత్యనారాయణ, వై.శ్రీరామచంద్రమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు వెయ్యి ఎకరాలకు సంబంధించి ముంపు నీరు బయటకు పోయే అక్విడెక్టు కుంగిపోతోందన్నారు. దీని కారణంగా తరచూ పూడుకుపోయి, ముంపునీరు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా దీనిని గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఈ అక్విడెక్టు ఉన్న రోడ్డు మీదుగా భారీ వాహనాలు వెళుతున్నాయని, దీంతో ఈ ప్రాంతంలో రోడ్డు మొత్తం శిథిలమైపోతోందన్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులే సొంత డబ్బుతో పూడికతీత, రోడ్డు మరమ్మతులు చేయించుకోవాల్సి వస్తోందన్నారు. అలాగే మడికి నుంచి దుళ్ల మీదుగా ఏడిద వెళ్లే పంట కాలువ రోడ్డు వెంబడి ఆక్రమణల కారణంగా సాగునీటికి ఇబ్బందులు వస్తున్నాయన్నారు. సంబంధిత అధికారులు తక్షణం వీటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రజల భాగస్వామ్యంతో శ్రమదానాలు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజల భాగస్వామ్యంతో శ్రమదానాలు నిర్వహించి, నగరంలోని అన్ని ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అధికారులకు అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో బుధవారం అన్ని శాఖల విభాగాధిపతులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం గోదావరి ఘాట్లను శుభ్రపరచనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములు చేయాలన్నారు. కలెక్టర్‌తో సహా ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఏక్ దిన్ - ఏక్ గంట- ఏక్ సాత్ నినాదంతో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఇందుకు కావాల్సిన పరికరాలు, సామగ్రిని ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని విభాగాధిపతులకు సూచించారు. అనంతరం వార్డు సచివాలయ కార్యదర్శులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి కార్యక్రమ నిర్వహణ, తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, సెక్రటరీ జి.శైలజ వల్లి, ఎంహెచ్ఓ వినూత్న, ఎస్ఈ (ఇన్‌చార్జి) రీటా, ఈఈ మదర్సా అలీ, మేనేజర్ ఎండీ అబ్దుల్ మలిక్, సీఎంఎం రామలక్ష్మి, ఏసీపీ నాగవల్లి పాల్గొన్నారు.

ప్రభుత్వమే మెడికల్ కాలేజీలు నడపాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఉమా మహేశ్వరరావు

ధవళేశ్వరం: మెడికల్ కాలేజీలను ప్రభుత్వ రంగంలోనే నడపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమా మహేశ్వరరావు డిమాండ్ చేశారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ సెంటర్‌లోని లక్ష్మీదాస్ భవన్‌లో బుధవారం ఆ పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పవన్ అధ్యక్షత వహించారు. ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ ఆరోగ్యం, వైద్యం, విద్య లాభాపేక్షతో నడిచే వ్యాపారం కాకుండా ప్రభుత్వ బాధ్యతగా కొనసాగాలన్నారు. ప్రైవేటీకరణ వల్ల ఫీజులు పెరగడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులకు అవకాశాలు దూరమవుతాయన్నారు. ప్రభుత్వమే కొత్త మెడికల్ కాలేజీలు స్థాపించి, ఇప్పటికే ఉన్న ప్రభుత్వ కాలేజీలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. జీఎస్టీ వల్ల ఏ వస్తువుల ధరలు ఎంత తగ్గాయో ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సామాన్యులు రోజువారీ ఉపయోగించే వస్తువుల ధరల భారం తగ్గించాలని కోరారు. కార్మికులకు కనీస వేతనాలు పెంచని రాష్ట్ర ప్రభుత్వం పని గంటలు పెంచుతూ అసెంబ్లీలో బిల్లును ఆమోదించడం కార్మిక ద్రోహం అని విమర్శించారు. జిల్లా కార్యదర్శి టి.అరుణ్ జిల్లాలో నిర్వహించాల్సిన కార్యాచరణ ప్రణాళికను ప్రవేశ పెట్టారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జువ్వల రాంబాబు, తులసి, జిల్లా నాయకులు ఎస్ఎస్ మూర్తి, రామకృష్ణ, పూర్ణిమరాజు, సుందర్ బాబు, బేబీ రాణి, టీఎస్ ప్రకాష్, సుబ్బారావు, సావిత్రి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ బాధ్యతలు మాకొద్దు



ఎంపీడీవో ఆర్మ్‌స్ట్రాంగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్పీలు

రాజమహేంద్రవరం రూరల్: పింఛన్ల పంపిణీ బాధ్యతల నుంచి తమను తప్పించాలని మండలంలోని ఆర్పీలు కోరారు. ఈ మేరకు బుధవారం హుకుంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆర్మ్‌స్ట్రాంగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఆర్పీలు మెప్మా పరిధిలో పని చేస్తున్నామని, అర్బన్ మహిళాకాశం యాప్ వచ్చిందని, ఆ యాప్ ఎప్పుడు ఓపెన్ అయితే అప్పటి నుంచి విధులు చేయాల్సి ఉందన్నారు. గ్రూప్ సమావేశాలు, లోన్ రిక్వెస్టులు, మెంబర్ యాడింగ్‌లు, లైవ్ హుడ్, సూర్యఘర్ మొదలుగు పనులన్నీ యాప్‌లో మాత్రమే చేయాలన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర యాప్‌లో హోం కంపోస్టు, టెర్రస్ గార్డెన్, సభ్యుల డేటాను పొందుపర్చాలని, నిరక్షరాస్యులకు విద్యాబుద్ధులు నేర్పించే ఉల్లాస్ కార్యక్రమం పని కూడా తమదేనన్నారు. ఇక ప్రతి నెలా ఒకటో తేదీన సచివాలయ ఉద్యోగులకు సహాయకులుగా ముందు ఆర్పీలను తీసుకుని, ఆర్పీలకు పింఛన్లు పంపిణీ చేసే బాధ్యతను అప్పగించడం జరిగిందన్నారు. ఇప్పటికే యాప్‌లు, అనేక పనులతో తమపై ఒత్తిడి అధికమైందన్నారు. కావున పింఛన్ల పంపిణీ బాధ్యతల నుంచి తప్పించాలని కోరారు.

అలరించిన భరత నాట్యం



నృత్య కళాకారిణులను సత్కరిస్తున్న గూడూరి శ్రీనివాస్ తదితరులు

సీటీఆర్ఐ: అమెరికాలోని చికాగోకి చెందిన లయ రాజ్, హైదరాబాద్‌కు చెందిన వైష్ణవీ శరణ్య మంగళవారం రాత్రి గౌతమ ఘాట్‌లోని జ్ఞాన సరస్వతి ఆలయ ప్రాంగణంలో భరత నాట్యం ప్రదర్శించారు. వైఎస్సార్‌సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఆయన సతీమణి వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ గూడూరి రాధిక ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం లయ రాజ్, వైష్ణవీ శరణ్యలను ముఖ్య అతిథులు సత్కరించారు. అలాగే డాక్టర్ గూడూరి శ్రీనివాస్ రాధిక దంపతులను తోట సుబ్బారావును, పలువురు సన్మానించారు.

గర్భిణులకు సీమంతం

రాజమహేంద్రవరం రూరల్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు ప్రతి రోజు వ్యాయామం చేయాలని జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ సాధికారిత అధికారి తోట శ్రీదేవి, టీడీపీ రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ అన్నారు. 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం బొమ్మూరులోని బత్తిన సుబ్బారావు కమ్యూనిటీ హాల్లో ఐసీడీఎస్, అమెరికన్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు.

- కాతేరులోని అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతం నిర్వహించారు. వారికి పౌష్టికాహారం కిట్, పండ్లు పంపిణీ చేశారు.

ప్యాసింజర్ ఆటో చోరీ

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు ఎన్టీఆర్ సెంటర్ వద్ద పార్కు చేసిన ప్యాసింజర్ ఆటో చోరీకి గురైందని కర్నాటి నాగరాజు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కర్నాటి నాగరాజు ఓ ప్రైవేటు స్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ, ప్యాసింజర్ ఆటోను అద్దెకు ఇస్తుంటాడు. ఈ ఏడాది జూలై ఒకటో తేదీ రాత్రి 8 గంటల సమయంలో కాతేరు ఎన్టీఆర్ బొమ్మ వద్ద సెలూన్ ఎదురుగా పార్కు చేశాడు. రెండో ఉదయం 7 గంటలకు చూసే సరికి కనిపించలేదు. ఇప్పటివరకు వెతికినప్పటికీ దొరకలేదని నాగరాజు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు త్రీటౌన్ ఎస్సై అప్పలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నపూర్ణగా కనకదుర్గమ్మ



దేవీచౌక్‌లో గాయత్రీ దేవిగా అలంకరణ



వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారికి జంతికలతో అలంకరణ



మోరంపూడి సాయినగర్‌లో విజయ కనక దుర్గాదేవి



బాలాజీపేట సెంటర్‌లో అమ్మవారు

సీటీఆర్ఐ: దసరా మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ప్రముఖ ఆలయాలు, మండపాల్లో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. దేవీచౌక్‌లోని బాలా త్రిపుర సుందరీదేవిని బుధవారం అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. సరస్వతి ఘాట్, ఉమా మార్కండేయేశ్వర స్వామి ఆలయాల్లో అమ్మవారు అన్నపూర్ణగా దర్శనమిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా సాయంత్రం చండై వాయిద్యాలు, రాత్రి సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శించారు.

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి సాయి నగర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ఆలయ ధర్మకర్త మేడి త్రిమూర్తులు ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. బాలాజీపేట సెంటర్‌లోని విజయ కనక దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణగా దర్శనమిచ్చారు. కోటిపల్లి బస్టాండ్ సెంటర్‌లో ఆటోయూనియన్ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు జరిపారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు



ఆక్రమణలను పరిశీలిస్తున్న ఆర్డీఓ కృష్ణ నాయక్

సీటీఆర్ఐ: పుంత రోడ్డులో ఆక్రమణల తొలగింపునకు ఆర్డీఓ కృష్ణ నాయక్ చర్యలు చేపట్టారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ సమీపంలో ఆర్ఎస్‌నెం.415లో ప్రభుత్వానికి సంబంధించిన పుంత రోడ్డును పాకలు వేసుకుని ఆక్రమించుకున్న వారితో చర్చించారు. ఆయన మాట్లాడుతూ ఆక్రమణ కారణంగా ఆ ప్రాంతంలో వాహనాలు వెళ్లడానికి వీలు కాక, ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. అక్కడ నివాసముంటున్న వారికి రాజానగరం మండలం వెలుగుబందలో ఇళ్లు కేటాయించారని, అయినా అక్కడకు వెళ్లకుండా ఇక్కడే ఉండటంతో అనేక సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. వారందరితో ఆర్డీఓ సామరస్యంగా మాట్లాడి, వారికి కేటాయించిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు.

314 మందికి వైద్య పరీక్షలు

కడియం: మండలంలోని కడియపుసావరం -1, దామిరెడ్డిపల్లి గ్రామాల్లో బుధవారం ఏర్పాటు చేసిన శిబిరాల్లో 314 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు ప్రభుత్వ వైద్యులు ఎం.మణిజ్యోత్స్న, ఎన్.జెస్సీ సుప్రియ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలు, కిశోర బాలికలు, వృద్ధులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి, మందులు అందించామన్నారు. ఆయా కార్యక్రమాల్లో సావరం సర్పంచ్ చెక్కపల్లి మురళీకృష్ణ, సాపిరెడ్డి కామేష్, ఆకుల శ్రీధర్, దామిరెడ్డిపల్లిలో ఉప సర్పంచ్ ముద్రగడ జెమి, గాజుల సూరిబాబు, నరమామిడి మాచరయ్య పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై చర్యలేవి

కంబాలచెరువు: మోరంపూడి శ్రీచైతన్య హాస్టల్లో ర్యాగింగ్ పేరుతో విద్యార్థిని హింసించిన వారిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా జాప్యం చేయడం, ఇంత జరుగుతున్న చోద్యం చూస్తున్న కూటమి ప్రభుత్వ విధానం సరికాదన్నారు. కోనసీమ జిల్లా మలికిపురం మండలం శంకరగుప్తం గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థి గుర్రం విన్సెంట్ ప్రసాద్ (16)పై సహచర విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే, వారిపై యాజమాన్యం, ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. సమస్యలపై మాట్లాడకుండా ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచేలా మంత్రి లోకేష్ ప్రవర్తిస్తున్నారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలకు ఒక ధీమా వచ్చేసిందని, ఎంత దోపిడీ అయినా చేసుకోవచ్చు అనే భావనలో ఉన్నారన్నారు.

డ్రగ్స్ రహిత దేశమే ధ్యేయంగా ర్యాలీ



రాజమహేంద్రవరంలో ర్యాలీ చేస్తున్న బీజేపీ శ్రేణులు

రాజమహేంద్రవరం సిటీ: డ్రగ్స్ రహిత దేశమే ధ్యేయంగా బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో నమో యువ రన్ పేరుతో బుధవారం ర్యాలీ నిర్వహించారు. కంబాల చెరువు సెంటర్ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకూ జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు , బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నార్సిపల్లి హారిక, యువ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు బేతిరెడ్డి ఆదిత్య, రాష్ట్ర కార్యదర్శి కందుకూరి మనోజ్ బాబు తదితరులు పాల్గొనారు.

వివాహిత అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: ఇంటి నుంచి వెళ్లిన తన భార్య తిరిగి రాలేదని ఆర్యాపురానికి చెందిన సూరంపూడి సత్తిబాబు బుధవారం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఆర్యాపురానికి చెందిన 25 ఏళ్ల సూరంపూడి జగదీశ్వరి.. విజేత బిర్యానీ పాయింట్‌లో పనిచేస్తుంటుంది. ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నాం 4.30 గంటల సమయంలో అక్కడకు వెళుతున్నానని చెప్పి బయలుదేరింది. కానీ ఇప్పటివరకు తిరిగిరాలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్కే సుభానీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.